

కానూరు దళితవాడ అభివృద్ధికి నిధులు మంజూరు

కమిషనర్ ప్రకాశరావు



పెనమలూరు: కానూరు దళితవాడలో అభివృద్ధికి చర్యలు చేపట్టామని తాడిగడప మున్సిపాలిటీ కమిషనర్ ఎన్.ప్రకాశరావు తెలిపారు. వర్షాల కారణంగా దళితవాడలో నీరు చేరటంతో ఆయన బుధవారం కానూరు దళితవాడను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన వివరాలు తెలుపుతూ కానూరులో రోడ్లు, డ్రైనేజీలు పల్లంగా ఉండటం వలన వర్షం కురిసిన సమయంలో నీరు బయటకు వెళ్లటం లేదన్నారు. ఎమ్మెల్యే పార్థసారథి ఆదేశాలతో దళితవాడలో రోడ్లు, డ్రైనేజీలు రూ.70 లక్షలతో నిర్మాణం చేపడతామన్నారు. వచ్చే నెల నుంచి పనులకు శ్రీకారం చుడతామని తెలిపారు. మురుగునీటితో వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకుంటామని అన్నారు.

30న స్వరలయ సౌరభం

విజయవాడకల్చరల్: శ్రీ సుబ్రహ్మణ్య మహతి సంగీత సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 30వ తేదీ ఆదివారం స్వరలయ సౌరభం సంగీత కార్యక్రమం నిర్వహిస్తునట్లు సంస్థ ప్రధాన కార్యదర్శి సీవీ రావ్ ఒక ప్రకటనలో తెలిపారు.

నేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా జీవన్‌కుమార్



కంకిపాడు: నేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడుగా మండలంలోని పునాదిపాడు గ్రామానికి చెందిన కలపాల జీవన్‌కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు కౌన్సిల్ వ్యవస్థాపక అధ్యక్షుడు రైట్ రెవరెండ్ డాక్టర్ శామ్‌పాల్, నేషనల్ ప్రెసిడెంట్ రెవరెండ్ డాక్టర్ ఎ.స్టీఫెన్ చిట్టిబాబు నియామక ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ ఉత్తర్వులు బుధవారం జీవన్‌కుమార్‌కు అందాయి. ఈ సందర్భంగా జీవన్‌కుమార్ మాట్లాడుతూ క్రిస్టియన్ కౌన్సిల్ తనపై ఉంచిన బాధ్యతలను సమర్థంగా నిర్వహిస్తానన్నారు. క్రిస్టియన్‌ల హక్కులు, వారి సంరక్షణ కోసం పనిచేస్తానన్నారు.

పోక్సో చట్టం కింద కేసు నమోదు

కంకిపాడు: మైనరు బాలికతో అసభ్యకరంగా ప్రవర్తించిన సంఘటనపై స్థానిక పోలీసుస్టేషన్‌లో బుధవారం రాత్రి పోక్సో చట్టం కింద కేసు నమోదైంది. అదనపు ఎస్ఐ జె.లక్ష్మి తెలిపిన కథనం మేరకు...మండలంలోని గొల్లగూడెం గ్రామానికి చెందిన మహిళ భర్త తొమ్మిది నెలల క్రితం మృతి చెందాడు. ఈమెకు ముగ్గురు కుమార్తెలు. పెద్ద కుమార్తె (13) కోలవెన్ను జెడ్పీ పాఠశాలలో ఏడో తరగతి చదువుతోంది. ఈనెల 25న గ్రామంలోని సిరివెళ్ల శ్రీనివాసరావు దుకాణం వద్దకు సరుకుల కొనుగోలు నిమిత్తం వెళ్లింది. ఇంటికి తిరిగి వచ్చాక ఏడుస్తూ ఉండటంతో తల్లి ఏం జరిగిందని ఆరా తీసింది. దీంతో షాపు యజమాని శ్రీనివాసరావు తనను షాపు లోపలికి పిలిచి చాక్లెట్ ఇస్తానని చెప్పి లోనికి వెళ్లాక అసభ్యకరంగా ప్రవర్తించాడని తెలిపింది. ఎవరికైనా జరిగిన విషయం చెబితే చంపేస్తానని బెదిరించాడని వాపోయింది. దీంతో బాలిక తల్లి పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేసింది. ఈ మేరకు 354 (ఏ), 506 సెక్షన్ 8 పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు అదనపు ఎస్ఐ లక్ష్మి తెలిపారు.

సామాజిక విప్లవకారుడు గోరా



పటమట(విజయవాడతూర్పు): గోరా విశిష్ట వ్యక్తిగానే కాకుండా సాంఘిక శక్తిగా, సామాజిక విప్లకారుడిగా, స్వేచ్ఛకు, సమానత్వానికి, మానవత్వానికి ప్రతీకగా నిలిచారని ప్రముఖ నాస్తిక ఉద్యమకారుడు కె.సుధాకర్ అన్నారు. గోరా 48వ వర్ధంతిని పురస్కరించకుని బెంజిసర్కిల్ వద్ద ఉన్న నాస్తిక కేంద్రంలో బుధవారం సదస్సు నిర్వహించారు. సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన సుధాకర్ మాట్లాడుతూ.. గోరా సామాజిక రుగ్మతలను పారద్రోలేందుకు, బానిస ప్రవృత్తి మీద జీవితాంతం పోరాడారన్నారు. దేవుడు ఒక ఊహే కాదు.. అబద్ధమని ప్రకటించారన్నారు. గాంధీ సహచర్యంతో ఆయన బాటలో నడిచి స్వాతంత్ర్య ఉద్యమంలో పోరాడిన ఘనుడని కొనియాడారు. కార్యక్రమంలో డాక్టర్ సమరం, మారు, నియంత, హరిసుబ్రహ్మణ్యం, మోతుకూరి అరుణ్ కుమార్, రేష్మి పాల్గొన్నారు.



























క్లుప్తంగా

కుటుంబ ప్రేమ కథా చిత్రం ఉస్తాద్



లబ్బీపేట(విజయవాడతూర్పు): కుటుంబ ప్రేమ కథా చిత్రం ఉస్తాద్ ప్రతి ఒక్కరినీ అలరిస్తుందని ఆ చిత్ర కథానాయకుడు సింహా కోడూరి అన్నారు. ఒక యువకుడు పైలట్ కావాలనే తన లక్ష్యాన్ని ఎలా చేరుకున్నాడో తెలిపే కథాంశమే ఈ చిత్రమని ఆయన పేర్కొన్నారు. నగరంలోని ఓ హోటల్‌లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఉస్తాద్ చిత్ర హీరో సింహా, హీరోయిన్ కావ్య కళ్యాణ్‌రామ్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆగస్టు 12న విడుదల కానున్న ఉస్తాద్ చిత్రం ప్రమోషన్‌లో భాగంగా నగరానికి విచ్చేశామన్నారు. అందులో భాగంగా కెఎల్‌యూలో ట్రైలర్ లాంచ్ చేయడం సంతోషంగా ఉందని చెప్పారు. ప్రేమ కథతో పాటు ప్రతి కుటుంబంలో యువకుడికి తల్లిదండ్రుల నుంచి ఎదురయ్యే చీత్కారాలు, ప్రేమ అభిమానాలు ఈ చిత్రంలో పుష్కలంగా ఉన్నాయన్నారు. ప్రతి ఒక్కరికీ ఉస్తాద్ చిత్రం కచ్చితంగా నచ్చుతుందన్నారు. హీరోయిన్ కావ్య కళ్యాణరామ్ మాట్లాడుతూ.. విజయవాడలో సినిమా ట్రైలర్‌ను లాంచ్ చేశామని, సక్సెస్ మీట్ కూడా ఇక్కడే నిర్వహిస్తామన్నారు. సమావేశంలో నిర్మాత రాకేష్, నటుడు సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

'మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన విధించాలి'

గాంధీనగర్(విజయవాడసెంట్రల్):మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన విధించాలని, తక్షణమే శాంతి నెలకొల్పాలని ఫాదర్ బ్రెన్‌హం డిమాండ్ చేశారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో క్రైస్తవ మైనార్టీ సంఘాల ఆధ్వర్యంలో మణిపూర్‌లో శాంతి నెలకొల్పాలని కోరుతూ బుధవారం కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. తొలుత శాంతి ప్రార్థన చేపట్టారు. అనంతరం మణిపూర్ దాడుల్లో మరణించిన వారికి సంతాపం తెలిపారు.

ఎటు చూసినా నీళ్లే...


మద్దూరు ఎస్సీ కాలనీలో ఇళ్ల చుట్టూ నిలిచిన వర్షపు నీరు


చెరువును తలపిస్తున్న కంకిపాడు-గన్నవరం ప్రధాన రహదారి

- రోడ్లన్నీ జలమయం
- ముంపులో వరి పొలాలు
- లోతట్టు ప్రాంత ఇళ్ల చుట్టూ చేరిన నీరు
- ముంపు పొలాలను పరిశీలించిన వ్యవసాయాధికారులు

కంకిపాడు: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో బుధవారం కుండపోత వర్షం కురిసింది. ఎడతెరపి లేకుండా కురిసిన వర్షానికి రోడ్లన్నీ జలమయంగా మారాయి. కంకిపాడు బస్టాండు సెంటరు, రైతుబజారు ఏరియా, కంకిపాడు–గన్నవరం ప్రధాన రహదారి, అండర్‌పాస్‌ల వద్ద భారీగా వర్షపునీరు నిలిచిపోయింది. వాహనాల రాకపోకలకు వాహనదారులు ఇబ్బందులు పడాల్సి వచ్చింది.

5 వేల ఎకరాల్లో వరి పొలాలు ముంపు

అల్పపీడనంతో ఐదురోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని వివిధ గ్రామాల్లో వరి నాట్లు పూర్తయిన పొలాలు ముంపునకు గురయ్యాయి. ముస్తఫా కోడు గుర్రపుడెక్కతో నిండి మురుగుపోయే మార్గం లేకపోవటంతో కోలవెన్ను పరిధిలో వరి పొలాలు నీట మునిగాయి. ఉప్పలూరు, మంతెన, జగన్నాధపురం, ఈడుపుగల్లు, మద్దూరు, గొడవర్రు, ప్రొద్దుటూరు, దావులూరు, చలివేంద్రపాలెం, కుందేరు పరిసరాల్లో సుమారుగా 5 వేల ఎకరాల్లో వరి నాట్లు వేసిన పొలాలు నీట మునిగాయి. పొలాల ముంపుతో వ్యవసాయాధికారులు గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు. పొలాలు నీట మునిగిన గ్రామాల్లో వాస్తవ పరిస్థితులను వ్యవసాయాధికారి పీఎం కిరణ్ పరిశీలించారు. పంట ముంపు వివరాలను నమోదు చేసి ఉన్నతాధికారులకు నివేదిక పంపారు. పొలాల్లో ఉన్న నీటిని బోదెల్లోకి మళ్లించి, పంట సంరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై రైతులకు సూచనలు ఇచ్చారు.

ఇళ్ల చుట్టూ చేరిన నీళ్లు

భారీ వర్షాలతో లోతట్టు ప్రాంతాలు వర్షపునీటితో నిండిపోయాయి. మద్దూరు ఎస్సీ కాలనీతో పాటుగా ఈడుపుగల్లు చింతల తోట జగనన్న లే అవుట్, గొడవర్రు, ప్రొద్దుటూరు జగనన్న లే అవుట్‌లలోని రహదారులు జలమయం అయ్యాయి. నీళ్లు నిలిచిపోవటంతో రాకపోకలు సాగక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

ముంపు సమస్య పరిష్కరించండి : ఎమ్మెల్యే పార్థసారథి

భారీ వర్షాలకు తలెత్తిన ముంపు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పార్థసారథి ఆదేశించారు. ముస్తఫా కోడు పూడిక తీత, ఇతర పంటల కాలువల నీటి ఉధృతి తగ్గింపుపై చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్, డ్రెయినేజీ విభాగాల అధికారులకు స్పష్టం చేశారు. బుధవారం ఆయన తన కార్యాలయం నుంచి అధికారులతో సమీక్ష చేశారు. కోలవెన్ను పొలాల ముంపునకు కారణమైన ముస్తఫా కోడులో తూడు తక్షణమే తొలగించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన «సాక్షి»తో మాట్లాడుతూ ముస్తఫా కోడు సమస్య పునరావృతం కాకుండా అధికారులకు సూచనలు ఇచ్చామన్నారు. కాలనీలు, ప్రధాన రహదారుల వెంబడి మురుగు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించామన్నారు. ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని వివరించారు.

నీటమునిగిన జాతీయరహదారి

రామవరప్పాడు: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి జాతీయ రహదారి నీటమునిగింది. రామవరప్పాడు, ప్రసాదంపాడు, ఎనికేపాడు గ్రామాల్లో జాతీయ రహదారిపై భారీగా వర్షపునీరు చేరింది. రోడ్డుకు రెండు వైపులా డ్రెయిన్లు పొంగడంతో వర్షపు నీటికి మురుగు నీరు తోడై హైవేపై రాకపోకలు సాగించే ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆయా గ్రామాల్లో వర్షపునీటి బయటకు పంపేందుకు పంచాయతీ కార్యదర్శులు చర్యలు తీసుకున్నారు. అంతర్గత రహదారుల్లోని డ్రెయిన్లను పూడికతీయిస్తున్నారు.

నీట మునిగిన వరిపొలాలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో బాపులపాడు మండలంలోని పలు గ్రామాల్లో నాట్లు చేసిన పొలాలు, వరి నారుమళ్లు నీట మునిగాయి. మండలంలో బుధవారం 89.60 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఆరుగొలను, ఓగిరాల, కానుమోలు, తిప్పనగుంట, కాకులపాడు, రంగయ్య అప్పారావు, రామన్నగూడెం గ్రామాల్లో పంటపొలాలు పూర్తిగా నీటమునిగాయి. వ్యవసాయ శాఖ అధికారుల ప్రాథమిక అంచనా మేరకు దాదాపు 1010 ఎకరాల్లో వరి చేలు నీటమునిగాయి. హనుమాన్‌జంక్షన్‌లో ప్రధాన రహదారులు, ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో భారీగా వర్షపు నీరు చేరింది.

ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు

ఉంగుటూరు: ఎడతెరిపి లేకుండా నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని వన్నేరు, బుడమేరు వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. దీంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. మానికొండ-తరిగొప్పల గ్రామాల మధ్య వన్నేరు పోటెత్తడంతో రెవెన్యూ, పోలీసులు అధికారులు రాకపోకలను నిలిపివేశారు. ఉంగుటూరులో నందమూరు–ఉంగుటూరు గ్రామాల మధ్య బుడమేరుకు ఎగువ ప్రాంతాల నుంచి వరదనీరు వచ్చి చేరుతోంది. వంతెన వద్ద గుర్రపు డెక్క, తూడు పేరుకుపోయింది. వంతెనపై నుంచి వర్షంనీరు ప్రవహిస్తోంది. దీంతో పలు గ్రామాల్లో బుడమేరు పక్కన ఉన్న పంట పొలాలు నీట మునిగాయి. గన్నవరం ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ సూచనల మేరకు అధికారులు బుడమేరు వంతెన వద్ద ప్రవాహానికి అడ్డుగా నిలిచిన గుర్రపు డెక్క తొలగింపు చర్యలు చేపట్టారు.

ముంపులో పంట పొలాలు

ఉయ్యూరు: కుండపోతగా కురుస్తున్న వర్షంతో పంట పొలాలు నీట మునిగాయి. ఉయ్యూరు మండలంలో 14,543 ఎకరాల్లో వరి నాట్లు వేశారు. అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు ఉయ్యూరు పట్టణంతో పాటు మండలంలోని 11 గ్రామాల్లో 3,052 ఎకరాల్లో వరి పొలాలు ముంపునకు గురయ్యాయని వ్యవసాయాధికారులు ప్రాథమిక అంచనా వేశారు. కాలువలు, డ్రెయిన్లు పొంగిపొర్లటంతో పొలాల్లో నీటిని మళ్లించటం రైతులకు కష్టతరంగా మారింది. వరి పొలాలతో పాటు, వాణిజ్య పంటలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. పల్లపు ప్రాంతాల్లో, రహదారుల్లో నీరు నిలిచిపోవటంతో రాకపోకలకు జనం ఇబ్బందులు పడ్డారు. ఉయ్యూరు మున్సిపాలిటీలో నీరు నిల్వ ఉండకుండా ప్రత్యేక పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు. చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ, కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావు పర్యటించి పారిశుద్ధ్య సిబ్బందితో మురుగు మళ్లింపు చర్యలు తీసుకున్నారు.

గ్రామాల్లో కుండపోతగా వర్షం

విజయవాడరూరల్: మండలంలో బుధవారం తెల్లవారుజాము నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో రోడ్లు జలమయం అయ్యాయి. నున్న గ్రామంలో కొండలపై నుంచి వర్షపునీరు ఆర్‌అండ్‌బీ రోడ్డుపై ప్రవహించింది. ఆర్‌సీఎం చర్చివద్ద వాగు పొంగిపొర్లింది. ఆ నీరు ఎర్ర చెరువులోకి చేరింది. పాతపాడు, పి.నైనవరం గ్రామాల్లో వాగుల్లో వరద పొంగి సమీపంలోని ఎర్ర చెరువు, కుక్కలవాని చెరువుల్లోకి చేరింది. అంబాపురం గ్రామంలో బుడమేరు నీరు గొల్లపూడి కాలువలో కలవడంతో ఉధృతంగా ప్రవహిస్తోంది. ఒకటోవార్డులో రోడ్లు బురదమయం కావడంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

లోతట్టు ప్రాంతాల్లో సహాయక చర్యలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: భారీ వర్షాలకు బాపులపాడులోని హనుమాన్ నగర్, తారకరామ నగర్, మహాత్మాగాంధీ నగర్, నక్కా పాండురంగారావు నగర్, బండివాని చెరువుగట్టు ప్రాంతాల్లో దాదాపు 100 ఇళ్లు నీటమునిగాయి. సరైన డ్రెయినేజీ సదుపాయం లేకపోవటం, లోతట్టు ప్రాంతం కావటంతో ఇళ్లలోకి వర్షపు నీరు చేరింది. దీంతో బుధవారం సర్పంచ్ సరిపల్లి కమలాభాయి, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్, ఆయా వార్డు సభ్యులు జలమయమైన ప్రాంతాల్లో పర్యటించారు. అక్కడి ప్రజలకు భరోసా ఇచ్చారు. ఇళ్లలోకి చేరుకున్న నీటిని అగ్నిమాపక శాఖ అధికారుల సాయంతో మోటార్లు ఏర్పాటు చేసి బయటకు తరలించారు. జేసీబీ సాయంతో కచ్చా డ్రెయిన్లు తవ్వారు. ఇళ్లలోకి వర్షపు నీరు చేరి స్థానికులు వంట చేసుకోలేని పరిస్థితి ఉండటంతో 175 మందికి సర్పంచ్ సరిపల్లి కమలాభాయి ఉదయం టిఫిన్లు, మధ్యాహ్నం భోజనం పంపిణీ చేశారు. జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని, ఎంపీపీ యర్రగొర్ల నగేష్, పార్టీ నాయకులు ఆవిర్నేని శేషగిరిరావు, కిరణ్‌మూర్తి, కడవకొల్లు నాగేష్, వీఆర్వో చైతన్య సహాయక చర్యల్లో పాల్గొన్నారు.


కోలవెన్నులో పంట పొలాల ముంపునకు కారణమైన ముస్తఫా కోడు ఇదే


మానికొండ-తరిగొప్పల మధ్య రోడ్డుపై ప్రవహిస్తున్న వన్నేరు వాగు


ఈడుపుగల్లు జగనన్న లే అవుట్‌లో వర్షపునీటితో నిండిన రోడ్డు


కోలవెన్నులో మునిగిన పంట పొలాలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి కిరణ్


పేదలకు ఆహారం పంపిణీ చేస్తున్న సర్పంచ్ సరిపల్లి కమలాబాయి, ప్రజాప్రతినిధులు


రామవరప్పాడులో జాతీయ రహదారిపై వర్షపునీరు


సహాయక చర్యలు పరిశీలిస్తున్న సర్పంచ్ కమలాభాయి


రంగయ్యఅప్పారావు పేటలో జలశయాన్ని తలపిస్తున్న పంటపొలాలు


నున్న గ్రామంలో నీటమునిగిన రోడ్డు

మద్దూరు ఏటిపాయకు వరదనీరు

- ఒడ్డుకు చేర్చిన పడవలు
- నిలిచిన రాకపోకలు

కంకిపాడు: మద్దూరు వద్ద కృష్ణానది ఏటిపాయ వరదనీటితో ప్రవహిస్తోంది. అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు తోడు ఎగువన తెలంగాణలో భారీ వర్షాల కారణంగా ప్రకాశం బ్యారేజీకి వరదనీరు వచ్చి చేరుతోంది. దీంతో మంగళవారం 80 వేల క్యూసెక్కులు, బుధవారం 80 వేల క్యూసెక్కుల వరదనీటిని అధికారులు సముద్రంలోకి వదిలారు. ఈ కారణంగా మండలంలోని మద్దూరు, కాసరనేనివారిపాలెం పరిధిలోని కృష్ణానది ఏటిపాయకు వరదనీరు చేరింది. ఏటిపాయలో లంక భూముల్లోకి వెళ్లేందుకు నిర్మించుకున్న రహదారుల మీదుగా వరదనీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. ఏటిపాయ కట్ట దిగువ అంచులు తాకుతూ వరదనీరు సముద్రం వైపు సాగుతోంది. వరదనీటి ప్రవాహంతో ఏటిపాయలోని లంక భూములు, గుంటూరు జిల్లా వల్లభాపురం, కొల్లిపర, గొడవర్రు గ్రామాలకు వెళ్లేందుకు రాకపోకలు స్తంభించాయి. ఏటిలోపల ఉన్న పడవలను మత్స్యకారులు ఒడ్డుకు చేర్చుతున్నారు. గొర్రెలు, మేకల పెంపకందారులు ఏటిపాయలోకి వెళ్లకుండా అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. అప్రమత్తంగా ఉండాలని సూచించారు.


మద్దూరు వద్ద కృష్ణానది ఏటిపాయలో ఉధృతంగా ప్రవహిస్తున్న వరదనీరు

రోడ్డును పరిశీలించిన పోలవరం అధికారులు

గన్నవరం రూరల్: మండలంలోని వీరపనేనిగూడెం - కొత్తగూడెం గ్రామాల మధ్యన పోలవరం కాలువ వంతెన సమీపంలో కోతకు గురైన రోడ్డును పోలవరం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కర్నా శ్రీనివాసరావు బుధవారం పరిశీలించారు. ములకలమ్మ చెరువు నుంచి వచ్చే నీటిని దిగువకు పంపేందుకు రైతులు రహదారికి అడ్డంగా తూములు ఏర్పాటుచేసి, వాటిపై మట్టిని పోశారని తెలిపారు. ఆ మట్టి సరిలేక పోవటంతో కోతకు గురైందన్నారు. ఈ రెండు గ్రామాల మధ్య రాకపోకలు కొనసాగుతున్నాయని చెప్పారు. గత వేసవిలో స్థానిక రైతులతో పోలవరం అధికారులు ముందస్తుగా చర్చించి అధికంగా వచ్చే నీటిని పంపేందుకు పోలవరం మట్టి బ్యాంకు వెంట కాలువ నిర్మించి, దాని ద్వారా ఎన్ఎస్పీ కాలువలోకి నీటిని పంపి సూపర్ పాసేజ్ ద్వారా తరలించేందుకు చర్చించామన్నారు. అయితే అది కార్యరూపం దాల్చలేదని తెలిపారు. ఇరిగేషన్ అధికారులు చర్యలు తీసుకుని ములకలమ్మ చెరువు నుంచి పంట చేల మీదుగా వచ్చే నీటిని మరలించేందుకు చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు. ఈ ప్రదేశాన్ని పరిశీలించినట్లు, వాస్తవ పరిస్థితిని నివేదిక రూపంలో ఉన్నతాధికారులకు పంపినట్లు చెప్పారు. పోలవరం డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సుబ్రహ్మణ్యం, ఏఈ విజయలక్ష్మి, పోలవరం స్పెషల్ డివిజన్ అధికారులు, ఇరిగేషన్ ఏఈ దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.


కోతకు గురైన రోడ్డు వద్ద పరిశీలిస్తున్న అధికారుల బృందం

తీర ప్రాంత ప్రజలు అప్రమత్తం

పెనమలూరులో కంట్రోల్ రూమ్

పెనమలూరు: అధిక వర్షాలతో కృష్ణానదికి వరద మొదలయింది. మండల పరిధిలో యనమలకుదురు, పెదపులిపాక, చోడవరం గ్రామాల పరిధిలో కృష్ణానదికి వరద నీరు రావటంతో ఘాట్‌ల వద్దకు నీరు చేరుకుంది. దీంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు ప్రకటించారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ వెంకటశివయ్య అధికారులతో బుధవారం అత్యవసర సమావేశం నిర్వహించారు. ప్రకాశం బ్యారేజీ నుంచి దాదాపు 70 వేల క్యూసెక్కుల వరద నీరు దిగువకు విడుదల చేశారని, నదీ పరివాహక ప్రాంతంలో ఉన్న వారు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ప్రధానంగా పెదపులిపాకలో గణపతినగర్, శ్రీనగర్, ఎన్‌టీఆర్ నగర్ వాసులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఈ మేరకు గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. చోడవరం ప్రాంతంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని, లంకల్లోకి వెళ్లరాదని, పశువుల కాపరులు కూడా జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. గ్రామాల్లో వీఆర్వోలు, మహిళా పోలీసులు 24 గంటలు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. మండల ప్రజల కోసం పెనమలూరులో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని తెలిపారు. అత్యవసరం ఉన్న వారు 97042 65004 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.


పెదపులిపాక వద్ద కృష్ణానది ఉధృతి

రెండు వేల ఎకరాల వరి పైరు నీట మునక

- నాటిన వరినాట్లకు దెబ్బ
- మొరాయించిన ఏనుగుల కోడు డ్రైన్


పెనమలూరు: పెనమలూరు మండల పరిధిలో వర్షాలు అధికంగా కురవటంతో రైతులకు కోలుకోలేని దెబ్బ తగిలింది. రైతులు సాగు చేస్తున్న వరి పంట పొలాలు దాదాపు రెండు వేల ఎకరాలు వర్షం నీటిలో మునిగిపోయాయి. వరి నాట్లు వేసిన కొద్ది రోజులకే నీట మునిగి పోవటంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పెనమలూరు మండలంలో సార్వా వరి సాగు దాదాపు ఆరువేల ఎకరాల్లో జరుగుతుంది. జిల్లాలో ఎక్కడా లేని విధంగా ఇక్కడ సార్వా వరి నాట్లు ముందుగా జరుగుతాయి. మండల పరిధిలో ఇప్పటివరకు దాదాపు 3 వేల ఎకరాల్లో వరి నాట్లు పడగా మరో 3 వేల ఎకరాల్లో నాట్లు వేయటానికి నారుమళ్లు సిద్ధంగా ఉన్నాయి. అయితే గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా వరి చేలు పూర్తిగా నీట మునిగాయి. నాట్లు వేసిన కొద్ది రోజులకే అధిక వర్షాలు కురవటంతో నాట్లు దెబ్బతినే పరిస్థితి ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా వణుకూరు, చోడవరం, పెదపులిపాక గ్రామాల్లో వరి చేలు చెరువులను తలపిస్తున్నాయి.

మొరాయించిన ఏనుగుల కోడు డ్రైన్

మండల పరిధిలోని పంట పొలాల్లో వృథా నీరు బయటకు వెళ్లటానికి ఉన్న ఏనుగుల కోడు డ్రైన్ పూర్తిగా మొరాయించింది. తాడిగడప, పెదపులిపాక, చోడవరం, పెనమలూరు, వణుకూరు గ్రామాల మీదుగా ఏనుగుల కోడు డ్రైన్ ఉంది. అయితే గత వేసవిలో మండల పరిధిలో డ్రైనేజీ పూడిక తీయక పోవటంతో డ్రైన్ గుర్రపుడెక్క, ఇతర పిచ్చి మొక్కలతో పూడుకుపోయి ఉంది. పంట పొలాల్లో వృథా నీరు డ్రైనేజీ నుంచి బయటకు వెళ్లటం లేదు. ఏనుగుల కోడు పూడిక తీసి ఉండి ఉంటే పరిస్థితి ఇలా ఉండేది కాదని, కేవలం అధికారులు నిర్లక్ష్యం కారణంగానే రైతులు నష్టపోయారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నీరు ఇలాగే ఉంటే నారు కుళ్లిపోయే ప్రమాదం ఉందని, పైగా క్యాట్ ఫిష్ నారుమళ్లలోకి ప్రవేశిస్తే నారుమళ్లు ధ్వంసమవుతాయని రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

నష్టం వివరాలు నమోదు

అధిక వర్షాల కారణంగా మండల పరిధిలో మునిగిన వరి పంటకు సంబంధించి ప్రాథమిక నివేదిక మండల వ్యవసాయాధికారులు నమోదు చేశారు.ఈ మేరకు వివరాలను బుధవారం జిల్లా అధికారులకు పంపారు. రెండు రోజులు గడిస్తే నష్టం ఏమేరకు జరిగిందో, రైతులు పంట కాపాడుకోవటానికి ఏప చర్యలు తీసుకోవాలో ప్రకటిస్తామని ఏవో కనకమేడల శైలజ తెలిపారు.


పెదపులిపాక గ్రామంలో నీట మునిగిన పంట పొలాలు

పేద విద్యార్థులకు అండగా నిలిచిన ఎమ్మెల్యే వంశీ


ఆర్థిక సాయం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

గన్నవరం: పేద విద్యార్థుల అభ్యున్నతికి ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ అందిస్తున్న సహకారం అభినందనీయమని పలువురు వైఎస్సార్ సీపీ నేతలు పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో బుధవారం నియోజకవర్గంలోని 20 మంది పేద విద్యార్థులకు ఎమ్మెల్యే వంశీమోహన్ అందజేసిన రూ.5 లక్షల నగదును పార్టీ నేతలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పార్టీ నాయకుడు మేచినేని బాబు మాట్లాడుతూ.. ప్రతిభకు పేదరికం అడ్డుకాకుడదనే ఉన్నత ఆశయంతో వంశీమోహన్ వేలాది మంది పేద విద్యార్థులకు ఆర్థిక తోడ్పాటు అందిస్తున్నారని తెలిపారు. బాపులపాడు ఎంపీపీ నగేష్ మాట్లాడుతూ.. విద్య ద్వారానే పేదరికాన్ని నిర్మూలించవచ్చని బలంగా విశ్వసించిన వంశీమోహన్ పేద విద్యార్థులకు అండగా నిలుస్తున్నారని చెప్పారు. గన్నవరం, ఉంగుటూరు, బాపులపాడు మండలాలకు చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

విద్యావనరుల కేంద్రంలో తనిఖీలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండల విద్యావనరుల కేంద్రంలో బుధవారం ప్రీ ఆడిట్ నిర్వహించారు. సమగ్రశిక్ష రాష్ట్ర కార్యాలయం అధికారులు కామేశ్వరరావు, మహేశ్వరరెడ్డి ఆడిట్‌కు హాజరై రికార్డులు, నిధుల వినియోగంపై తనిఖీలు చేపట్టారు. మండల విద్యా శాఖ పని తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఎంఈఓ–2 బి.సురేష్ కుమార్, కార్యాలయ సిబ్బంది వేముల అర్జున్ పాల్గొన్నారు.







ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ఎంపీపీ అనగాని రవి

గన్నవరం రూరల్: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీపీ అనగాని రవి తెలిపారు. మండలంలోని వీరపనేనిగూడెం సచివాలయం వద్ద సర్పంచ్ ఆరేపల్లి జేజమ్మ అధ్యక్షతన బుధవారం జరిగిన జగనన్న సురక్ష శిబిరంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గడప గడపకు సంక్షేమ పథకాలను అందజేశారన్నారు. వలంటీర్, సచివాలయం వ్యవస్థలతో గ్రామ స్వరాజ్యాన్ని తీసుకొచ్చిన వైఎస్సార్ సీపీకి అందరూ అండగా ఉండాలని కోరారు. గ్రామస్తులకు మంజూరు చేసిన 197 సర్టిఫికెట్లను ఆయన పంపిణీ చేశారు. సొసైటీ చైర్మన్ బి.శ్రీనివాసరెడ్డి, ఉప సర్పంచ్ బండి నాగసాంబిరెడ్డి, ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ ఎ.ఎస్.ఆర్.కోటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి బాపూజీ, వీఆర్వో వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు సందిపాటి సుబ్బారెడ్డి, ఆరేపల్లి వెంకటేశ్వరరావు, వార్డు సభ్యురాలు వేమండ శిరీష పాల్గొన్నారు. సూరంపల్లి గ్రామ సచివాలయం వద్ద జరిగిన జగనన్న సురక్ష శిబిరంలో ఎంపీడీఓ సత్యకుమార్, సర్పంచ్ పులపాక బాబూరావు పాల్గొని గ్రామస్తులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. పంచాయితీ కార్యదర్శి కోట సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



జగనన్న సురక్ష క్యాంపులో మాట్లాడుతున్న ఎంపీపీ అనగాని రవి

డ్రాప్ అవుట్స్‌ను తగ్గించాలి

గన్నవరం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం స్కూల్ కాంప్లెక్స్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంఈఓ రామ్‌బాల్‌సింగ్ మాట్లాడుతూ.. విద్యార్థుల డ్రాప్ అవుట్స్ తగ్గించడంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. కొత్తగా పాఠశాలలో చేరిన విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీ నిమిత్తం ఇండింట్ పెట్టాలని ఆదేశించారు. పాఠశాలలో ఎటువంటి సమస్యలు ఉన్న తమ దృష్టికి తీసుకువస్తే తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. మధ్యాహ్న భోజనంలో నాణ్యతా ప్రమాణాలు, మెనూ పాటించాలని సూచించారు. గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో సర్వేను వంద శాతం పూర్తిచేయాలని తెలిపారు. కాంప్లెక్స్ ఇన్‌చార్జ్ హెచ్‌ఎం కృష్ణకుమారి, సీఆర్పీలు టి.వి.దుర్గాదేవి, కాండ్రు మోహన్‌రావు, పలువురు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ రామ్‌బాల్‌సింగ్







● జీవాలకు సకాలంలో వైద్యసేవలు అందించాలి

నున్న(విజయవాడరూరల్): గొర్రెలు, మేకలకు సకాలంలో వైద్య సేవలు అందించాలని పశుసంవర్ధక శాఖ విజయవాడ డివిజన్ డెప్యూటీ డైరెక్టర్ డాక్టర్ వి.గోపీచంద్ సూచించారు. మండలంలోని గొర్రెలు, మేకల పెంపకందారులకు బుధవారం నున్నలోని ప్రాంతీయ పశువైద్యశాలలో శిక్షణ కార్యక్రమం జరిగింది. డీడీ గోపీచంద్ మాట్లాడుతూ వర్షాకాలంలో గొర్రెలు, మేకలను సాధ్యమైనంత వరకు తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నట్టల నివారణ టీకాలను వేయించాలని, వైద్య పరీక్షలు చేయించాలని సూచించారు. యాజమాన్య పద్ధతులపై పెంపకందారులకు అవగాహన కల్పించారు. పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకుడు డాక్టర్ టి.సాయిగోపాల్, ప్రాంతీయ పశువైద్య శాల నున్న సహాయ సంచాలకుడు డాక్టర్ డి.రాజశేఖర్ పాల్గొన్నారు.





